


ww.voodyam.com
Estd :1999

# ఉదయం

శుక్రవారం, అక్టోబర్ 17, 2025 | గుంటూరు | సంపుటి : 12 | సంచిక : 244 | వెల : రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM TELUGU DAILY


/VOODAYAM Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal






# మల్లన్న సేవలో..

- శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ప్రధాని మోదీ
- భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారికి పూజలు
- కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని
- చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ఘన స్వాగతం



శ్రీశైలం: కర్నూలు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ అధికారులు ఆయనకు లాంఛనంగా స్వాగతం పలికారు. భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారికి మోదీ పూజలు చేశారు. మల్లికార్జునస్వామికి పంచామృతాలలో రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి ఖడ్గమాల, కుంకుమార్చన పూజలు చేశారు. పూజల అనంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఇక్కడి శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను తిలకించనున్నారు. ప్రధానితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీశైలం చేరుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలులోని ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఇక్కడి నుంచి మోదీ హెలికాప్టర్‌లో సున్నిపెంట చేరుకోనున్నారు. రోడ్డుమార్గంలో శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్తారు. మధ్యాహ్నం 12.05 గంటల వరకు శ్రీశైల మల్లన్న క్షేత్రంలో ఉంటారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నన్నూరుకు వస్తారు. రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' బహిరంగ సభకు హాజరవుతారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వృద్ధికి తోడ్పడే ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు శంకుస్థాపన చేసి ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 4:45 గంటలకు తిరిగి ఢిల్లీ వెళ్తారు.





### శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన ప్రధాని మోదీ

కర్నూలు పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలంలో శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. రాజ దర్బార్ గోడలపై ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను తెలిపే శిల్పాలను ఆసక్తిగా పరిశీలించారు. అక్కడి శివాజీ విగ్రహం వద్ద నమస్కరించారు. శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను పరిశీలించారు. ధ్యానముద్రలో ఉన్న శివాజీ, అమ్మవారి విగ్రహాలను దర్శించుకున్నారు. అమ్మవారి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పుష్పాలను సమర్పించారు. ప్రధానితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వెళ్లారు. ఈ కేంద్రం నిర్వహణ బాగుందని ట్రస్టు నిర్వాహకులను ప్రధాని మోదీ అభినందించారు. అక్కడి నుంచి భ్రమరాంబ గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు.

### భారీగా ట్రాఫిక్ జామ్

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరుతో కర్నూలులో జరిగే ప్రధాని మోదీ బహిరంగసభకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. బస్సులు, కార్లలో ప్రజలు పెద్ద ఎత్తున సభా ప్రాంగణానికి చేరుకుంటున్నారు. సభకు వెళ్లే వాహనాలు భారీగా వస్తుండటంతో గూడూరు మండలం నాగలపురం గ్రామంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాదాపు 2 కి.మీ. వరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.



### లోకేశ్.. బరువు తగ్గావ్
#### మోదీ సరదా వ్యాఖ్యలు

బరువు బాగా తగ్గిపోయావంటూ మంత్రి నారా లోకేశ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ సరదా వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన కోసం ప్రధాని ఉదయం ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి లోకేశ్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేశ్‌తో మోదీ మాట్లాడుతూ "గతసారి చూసినప్పటికంటే ఇప్పుడు చాలా బరువు తగ్గావు. త్వరలోనే మీ నాన్నలా తయారవుతావు" అని వ్యాఖ్యానించారు.

### నవంబర్ 2 నుంచి చంద్రబాబు లండన్ పర్యటన

సీఎం చంద్రబాబు నవంబర్ 2 నుంచి 5 వరకు లండన్‌లో పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. నవంబర్ 14, 15న విశాఖలో భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు రావాలని లండన్‌లోని పారిశ్రామికవేత్తల్ని సీఎం కోరనున్నారు. రాష్ట్రం లో పెట్టుబడులు పెట్టేందుంకు గల అవకాశాలను వారికి వివరించనున్నారు.



#### కర్నూలులో మోదీ సభకు
### తరలివెళుతున్న ప్రజలు

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరుతో గురువారం కర్నూలులో జరిగే బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరుకానున్నారు. ఈ సభకు పలు ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బస్సుల్లో కర్నూలుకు చేరుకుంటున్నారు.

## నాడు తండ్రి.. నేడు కొడుకు


విశాఖ: విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం జరగడంతో గురువారం నగరంలోని మద్దిలపాలెం, హనుమంతువాక, సిరిపురం, వెంకోజిపాలెం, పీఎం పాలెం క్రికెట్ స్టేడియం తదితర కూడళ్లలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నాయకులు గంటా రవితేజ పేరిట భారీ హోర్డింగ్‌లు ఏర్పాటుచేశారు. నాడు తండ్రి చంద్రబాబు మైక్రోసాఫ్ట్‌ను తీసుకొచ్చి హైదరాబాద్ గతిని మార్చగా.. నేడు కుమారుడు లోకేశ్ కృషితో రానున్న గూగుల్ విశాఖ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందంటూ డిజైన్ చేసిన హోర్డింగ్‌లు ఆకట్టుకున్నాయి.

## కూటమి ప్రభుత్వం 15 ఏళ్లు కొనసాగాలి

కర్నూలు: 'స్ఫూర్తిదాయక నేత మోదీ.. ఆయనో కర్మయోగి. ఏ ఫలితం ఆశించకుండా, లాభాపేక్ష లేకుండా దేశసేవ చేస్తున్నారు. ఈ తరానికి దిశానిర్దేశం చేసే ప్రధాని స్థాయిలో ఆయన ఉండటం మనం చేసుకున్న అదృష్టం' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొనియాడారు. కర్నూలు సభలో ఆయన మాట్లాడుతూ.. 'మోదీ.. ప్రభుత్వాన్నే కాదు.. రెండు తరాల్ని ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పుడు పుట్టే బిడ్డలకు దిశానిర్దేశం చేస్తున్నారు. దేశం తలెత్తి చూసేలా ఆత్మనిర్భర భారత్ అమలుచేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన అండగా ఉన్నారు. దీంతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ప్రజల నమ్మకాలను నిలబెడుతూ మోదీ, చంద్రబాబు నాయకత్వంలో.. సమష్టిగా ముందుకెళ్తాం' అని చెప్పారు.


## ట్రంప్‌ను చూసి మోదీ భయపడ్డారు

- రాహుల్ గాంధీ ఎద్దేవా



రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును ఇకపై ఆపేస్తామని ప్రధాని నరేంద్రమోదీ తనకు హామీ ఇచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వాటిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ట్రంప్‌ను చూసి మోదీ భయపడ్డారని ఎద్దేవా చేశారు. ఈసందర్భంగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. ఈజిప్టులోని షర్మ్-ఎల్ షేక్‌లో సోమవారం గాజా శాంతి ఒప్పందం జరిగింది. ఆ కార్యక్రమానికి ప్రధాని హాజరుకాలేదు. ఆపరేషన్ సిందూర్ గురించి ట్రంప్ పదేపదే చేస్తోన్న ప్రకటనలను విభేదించడం లేదు" అని రాహుల్ గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అమెరికా నుంచి చమురు కొనుగోలు కు భారత్ సిద్ధంగానే ఉందని వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించిన విషయం తెలిసిందే. కానీ సరైన ధర లభిస్తేనే ఈ అంశాన్ని ఆలోచిస్తామని పేర్కొన్నారు. గతంలో అమెరికా నుంచి భారత్ 22-23 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం కొనుగోలు చేసేదని, ఇంకా అమెరికా నుంచి సుమారు 12-13 బిలియన్ డాలర్ల వరకు విలువైన ఇంధనం కొనుగోళ్లను పెంచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు నడుస్తోన్న సమయంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## భారత ఆర్థిక వ్యవస్థకు మా చమురు కీలకం: రష్యా



ట్రంప్ వ్యాఖ్యలపై రష్యా కూడా స్పందించింది. తమ చమురు దిగుమతులు భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమని ఇక్కడి రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, అది నమ్మకం అనే దృఢమైన పునాదిపై ఆధారపడి ఉందని వ్యాఖ్యానించారు. తాము భారత ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకొని ముందుకుసాగుతున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత్- అమెరికా సంబంధాల్లో తాము ఎలాంటి జోక్యం చేసుకోమన్నారు. ఈ క్రమంలో భారత్‌తో తమ దీర్ఘకాల సంబంధాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

